ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 317 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 23 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## బీసీ కులగణన సర్వే
# చారిత్రాత్మకమైన నిర్ణయం



### కులగణన రాహుల్ ఇచ్చిన అవకాశం

నూటికినూరు శాతం ఖచ్చితమైన సర్వే ఇది
కాంగ్రెస్ శ్రేణులు దీనిని అవకాశంగా తీసుకోవాలి
విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాలి
కాంగ్రెస్ బీసీ నేతల సమావేశంలో సీఎం రేవంత్ స్పష్టీకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం):** బీసీ కులగణన సర్వే చేపట్టడం ద్వారా చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కులగణన విషయంలో భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రాహుల్ గాంధీ మనకు ఇచ్చిన అవకాశం ఇదని, దీనిని ప్రజల్లోకి తీసుకుని వెళ్లి విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాలన్నారు. కేవలం అంతా సిఎం రేవంత్ చూసుకుంటారని అనుకుంటే కుదరదని అన్నారు. ప్రతి ఒక్కరూ కులాల వారీగా మీటింగ్‌లు పెట్టి ప్రజలకు వివరించాలన్నారు. దాదాపు 25 రోజుల పాటు తెలంగాణలో పాదయాత్ర చేశారని.. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని సోనియాగాంధీ తెలంగాణను ఇచ్చారన్నారు. రాహుల్ గాంధీ మాట ఇచ్చిన తర్వాతే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని సీఎం అన్నారు. రాహుల్ గాంధీ ఆశయం మేరకే సమగ్రమైన కులగణన చేపట్టామన్నారు. ఈ మేరకు బీసీ కులగణన సర్వేపై అనుమానాల నివృత్తిపై ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బిసి సంగాల నేతలతో ఆయన మాట్లాడారు. విపక్షాల తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేస్తూ పూర్తి పారదర్శకంగా సర్వే చేపట్టాం. అధికారిక కార్యాచరణకు అధికార బృందాన్ని వేశాం. బిహార్, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల్లోఅధ్యయనం చేశాం. కులగణనలో మూడు రోజుల పాటు ఇళ్ల వివరాలు సేకరించాం. ఇందుకోసం ప్రభుత్వంలోని 15 శాఖలకు చెందిన అధికారులను నియమించాం. మొత్తం 8 పేజీలతో ఇంటి యజమాని ఇచ్చిన సమాచారాన్ని సేకరించాం. 36 వేల మంది డేటా ఆపరేటర్లను అదనంగా నియమించాం. ఎన్‌రోలర్‌గా సమాచారం సేకరించిన వారే డేటా ఎంట్రీ చేశారు. దాదాపు కోటి 12 లక్షలకుపైగా కుటుంబాలు కులగణన సర్వేలో పాల్గొన్నాయని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కులగణన ప్రయత్నమే చేయలేదు. న్యాయపరంగా, చట్టపరంగా నిబంధనలకు లోబడి చేశాం. 96.9 శాతం జరిగింది... 3.1 శాతం సర్వే రాలేదు. ఇంత పారదర్శకంగా కులగణన చేపడుతున్నా కొంత మంది నాయకులు ఇంకా చేయించుకోలేదు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో ..మిగతా 2లో



## శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ వద్ద
# భారీ ప్రమాదం

సొరంగ పనులు చేపడుతుండగా కూలిన పైకప్పు
ఏడుగురు కార్మికులకు తీవ్ర గాయాలు
ఆస్పత్రికి తరలించి చికిత్స
సీఎం రేవంత్ దిగ్భ్రాంతి...హుటాహుటిని ఉత్తమ్ చేరిక

**నాగర్‌కర్నూలు, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం):** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలో శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ వద్ద ఈ భారీ ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం ఉదయం 8:30 గంటల సమయంలో మూడుమీటర్ల మేర పైకప్పు కూలిపోయిన ఘటనలో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. టన్నెల్ పనులు జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించడంతో ప్రాజెక్టు పరిసరాల్లో తీవ్ర కలకలం రేగింది. ఎడమవైపు సొరంగ పనులు జరుగుతుండగా, 14వ కిలోమీటర్ వద్ద ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మూడు మీటర్ల మేర పైకప్పు ..మిగతా 2లో



## సొరంగ ప్రమాదానికి
# బాధ్యత రేవంత్‌దే


రక్షణ చర్యలు లేకుండా పనులు చేపట్టారు
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమన్న హరీష్ రావు

2

## కుంభమేళాలో
# నడ్డా పవిత్ర స్నానం



**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం):** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా ముగింపు దశకు చేరుకుంది. మరో ఐదు రోజుల్లో మహాకుంభమేళా ముగియనుంది. ఈ క్రమంలో గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. 45 రోజుల పాటు ..మిగతా 2లో




2

## మున్నూరు కాపు సంఘం జోగులాంబ గద్వాల జిల్లా కన్వీనర్‌గా కొత్త గణేష్



## మహిళలకు నెలనెలా...
# 2500 పథకం

చర్చించేందకు అవకాశం ఇవ్వండి
సీఎం రేఖాగుప్తాకు మాజీ సీఎం అతిషి లేఖ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం):** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు మాజీ ముఖ్యమంత్రి, ఆప్ నేత అతిషి లేఖ రాశారు. మహిళలకు నెలకు రూ.2500 ఇచ్చే పథకం గురించి చర్చించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఫిబ్రవరి 23న ఆప్ శాసనసభా పక్షాన్ని కలవడానికి సమయం ఇవ్వాలని లేఖలో రేఖా గుప్తాను కోరారు. ఈనెల 20నే ఢిల్లీ ..మిగతా 2లో

## పాక్ జైలు నుంచి 22 మంది
# మత్స్యకారుల విడుదల



**లాహోర్, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం):** పాకిస్థాన్ జైలు నుంచి 22 మంది మత్స్యకారులు విడుదలయ్యారు. గతకొంతకాలంగా వీరు కరాచీ కారాగారంలో మగ్గుతున్నారు. వీరంతా అంతర్జాతీయ జలసంధిని దాటినందుకు అరెస్ట్ అయ్యారు. వారి శిక్షాకాలం పూర్తికావడంతో కరాచీలోని మాలిర్ కారాగారం నుంచి శుక్రవారం బయటకువచ్చారు. ఆ మత్స్యకారుల్ని భారత్‌కు అప్పగించే అవకాశం ఉందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ క్రమంలో భారత జాలర్లకు ఈదీ ఫౌండేషన్ సహాయసహకారాలు అందించింది. వారు కరాచీ నుంచి లాహోర్‌కు వెళ్లడానికి కావాల్సిన రవాణా సౌకర్యాలు ఏర్పాటుచేసింది. అక్కడి నుంచి వారు భారత్‌కు రానున్నారు. ఆ సంస్థ మత్స్యకారులకు ప్రయాణఖర్చులు, కొన్ని బహుమతులు, నగదు అందించింది. ఈ సందర్భంగా భారత్-పాక్ ప్రభుత్వాలకు ఈదీ ఫౌండేషన్ ఛైర్మన్ ఈదీ ఒక అభ్యర్థన చేశారు. ఎలాంటి దురుద్దేశం ..మిగతా 2లో



## కులగణనతో
# బీసీల భవిష్యత్ అంధకారం

కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

**నిజామాబాద్, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం):** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆరోపించారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన వల్ల రానున్న కాలంలో బీసీల భవిష్యత్ అంధకారంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కులగణనపై తమతో చర్చకు వస్తామని కాంగ్రెస్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. తాము చర్చలకు సిద్ధంగానే ..మిగతా 2లో



## బీసీ కులగణన సర్వే
# చారిత్రాత్మకమైన నిర్ణయం

మొదటి పేజీ తరువాయి...

4 విభాగాలుగా జనాభా శాతాన్ని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వేలో 5 కేటగిరీలున్నాయి. ముస్లింలలో ఓబీసీలను నాడు కేసీఆర్ ప్రభుత్వం విడిగా చెప్పలేదన్నారు. గుజరాత్‌లో కూడా ఓబీసీ ముస్లింలు ఉన్నారని ప్రధాని చెప్పారు. బీసీల లెక్క తేలితే మాకేంటి.. అని ఆ వర్గం అడుగుతారని భాజపా, భారాస భయపడుతోంది. దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుంది. రాహుల్ గాంధీ ప్రధాని అయితే.. అన్ని రాష్ట్రాల్లో కులగణన జరిగితీరుతుంది. కులగణనను కాపాడుకోకపోతే.. బీసీలే నష్టపోతారు. ఇంత పకడ్బందీగా సర్వే చేసిన రాష్ట్రం ఇకపై కూడా మరొకటి ఉండదని సీఎం అన్నారు. నివేదిక ఆధారంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో సూచనలు ఇవ్వాలని బీసీ సంఘాల నేతలను కోరారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ కార్యాచరణపై సూచనలివ్వాలని కోరారు. బీసీ జనాభా ప్రకారం వారికి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. కేసీఆర్ ,కేటీఆర్, హరీశ్ రావు జనాభా లెక్కల్లోనే లేరన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఇన్ని అవకాశాలు ఇచ్చిన.. వాళ్లు కులగణన సర్వేలో పాల్గొనలేదన్నారు. కులగణన సర్వే లెక్క తప్పైతే ఎట్ల తప్పో వచ్చి చూపించాలన్నారు. ప్రతిపక్షాలు మొండిగా..తొండిగా వాదిస్తున్నారని సిఎం రేవంత్ విమర్శించారు. కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే తప్పుల తడక అని అందుకు సర్వే వివరాలు బయటపెట్టలేదన్నారు. కేసీఆర్ చెప్పిన లెక్కల ప్రకారం బీసీలు తగ్గారు..ఓసీలు పెరిగారని చెప్పారు. కాకి లెక్కలు చెప్పి జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు రేవంత్. కులగణన సర్వే తెలంగాణ దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్ నిలుస్తోందన్నారు . దేశమంతా కులగణన చేయాల్సి వస్తుందని బీజేపీ భయపడుతోందన్నారు. కులగణన నూటికి నూరు శాతం పక్కా అని సీఎం రేవంత్ అన్నారు.కులగణన చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. బీసీ సంఘాలతో భేటీ అయిన రేవంత్ రెడ్డి.. కులగణనలో తెలంగాణ దేశంలోనే రోల్ మోడల్ గా నిలువబోతుందన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దన్నారు. సర్వే తప్పు అయితే..ఎట్ల తప్పో చూపించాలని బీజేపీ,బీఆర్ఎస్ కు సవాల్ విసిరారు. కుట్రలో భాగంగానే బీజేపీ,బీఆర్ఎస్ కులగణన సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని

మండిపడ్డారు. కులగణన లెక్కలు తప్పు కాదని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కులాల వారీగా సమావేశాలు నిర్వహించి కులగణన లెక్క పక్కా అని మార్చి 10 లోగా తీర్మానం చేయాలని సూచించారు. ఇకపోతే బీసీ నేతల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఫైరయ్యారు. పార్టీ నేతలకు ముఖ్యమంత్రి క్లాస్ పీకారు. నేను చేసేది చేసినా.. ఇక మీ ఇష్టం అని నేతలకు సూచించారు. రాహుల్ గాంధీ మనకు ఇచ్చిన ఆస్తి సర్వే.. కర్ర పట్టుకుని కాపాడుకుంటారో లేదో మీ ఇష్టం అని అన్నారు. సర్వే చేసినా నన్ను తిడుతున్నారు.. సర్వేలో కూడా పాల్గొనని వాళ్ళను మంచోడు అంటున్నారని తెలిపారు. సర్వేలో పాల్గొనని వాళ్ళ ఇంటి ముందు డప్పు కొట్టండి.. బలహీన వర్గాల నేతలు కులాల వారిగా సమావేశాలు పెట్టండని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బీసీల కోసం సర్వే చేసిన అని తనకు గర్వంగా ఉందని తెలిపారు. తాను తల ఎత్తుకుని తిరిగే పని చేశానన్నారు.. సర్వే బలహీన వర్గాల భావోద్వేగం.. మీరు కలిసి రండి అని అన్నారు. మిగిలిన విషయాల్లో విభేదించినా ఇబ్బంది లేదు.. కానీ కుల గణన విషయంలో మాత్రం తనకు సహకరించండని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మార్చి 10 లోపు అన్ని సంఘాలతో మీటింగులు పెట్టి చెప్పండి.. ఈ లెక్కలు కాదు.. కూడదు అని అంటే జీవితంలో మళ్ళీ అవకాశం రాదని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నివేదికను అనాథ చేయకండి.. ఎవరి కులం వారు ఆ సంఘాల సమావేశం పెట్టండని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ నేతలకు సూచించారు. కేసీఆర్ సర్వే ఎంత గొప్పగా ఉందో ఎస్సీ, ఎస్టీ ఉప కులాల లెక్క చూస్తే అర్థం అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. సమగ్ర సర్వేలో ఎస్సీలలో 82 కులాలు అని చెప్పారు.. ఎస్సీ, ఎస్టీ ఉప కులాల సంఖ్య పెరిగింది. సమగ్ర సర్వే అర్థం పర్థం లేని లెక్కలు. సిగ్గుతో బయట పెట్టలేదు. బీఆర్ఎస్, బీజేపీ కోర్టుకు వెళ్లి బీసీ కుల గణన ఆపాలని చూస్తున్నాయి. అందుకే లెక్క సరిగ్గా.. ఆధారాలతో సహా చేశాం. కంప్యూటర్ లోనే కాదు.. సర్వే చేసిన పేపర్ బండిల్ కూడా సిద్ధంగా ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమావేశంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, విహెచ్, మంత్రులు భట్టి, పొన్నం తదితరులు పాల్గొన్నారు.

## కులగణనతో బిసిల భవిష్యత్ అంధకారం

మొదటి పేజీ తరువాయి...

ఉన్నామని, దానికి ముందు వారు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చిన అనంతరం తమతో చర్చలకు రావాలని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. అధికారంలోకి రాక ముందు వంద రోజుల్లో వాగ్దానాలు పూరి చేస్తామని మాటిచ్చిన కాంగ్రెస్, 400 రోజులు గడుస్తున్న వారిచ్చిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కంటున్న కలలు నీరుగారి పోతున్నాయని, దేశంలో జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చింది గాడిద గుడ్డేనని విమర్శించారు. అందుకు ఢిల్లీ ఎన్నికలే నిదర్శనమని కేంద్రమంత్రి అన్నారు. రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తుందని, బీసీలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని వెల్లడించారు.ఈ సమావేశంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ ప్లలె గంగారెడ్డి, ఎంపీ అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## మహిళలకు నెలనెలా...
# 2500 పథకం

మొదటి పేజీ తరువాయి...

ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేశారు. సాయంత్రం కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి ఆయుష్మాన్ భారత్ పథకంపై నిర్ణయం తీసుకున్నారు. ఇక రేఖా గుప్తా ప్రమాణస్వీకారం రోజునే అతిషి ప్రెస్‌మీట్ పెట్టి.. తొలి కేబినెట్‌లోనే మహిళలకు రూ.2,500 పథకంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు కదా? అని నిలదీశారు. ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. దీనిపై శుక్రవారం రేఖా గుప్తా స్పందిస్తూ.. ఒక్క రోజు కాకముందే అతిషి విమర్శలు చేస్తున్నారంటూ తప్పుపట్టారు. కాంగ్రెస్, ఆప్ పాలించిన రోజులు గుర్తుచేశారు. మీరేం చేశారంటూ రేఖా గుప్తా తిరిగి ప్రశ్నించారు. తాజాగా మరోసారి అతిషి.. మహిళలకు రూ.2,500 పథకం గురించి లేఖ రాశారు. దీనిపై రేఖా గుప్తా ఎలా స్పందిస్తారో చూడాలి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 48, ఆప్ 22 సీట్లు సాధించాయి. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో కాషాయ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంది. అనూహ్యంగా రేఖా గుప్తాకు ముఖ్యమంత్రి పదవి దక్కింది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచినా.. ఆర్ఎస్ఎస్‌తో మంచి సంబంధాలు ఉండడంతో అవకాశం దక్కినట్లుగా వార్తలు వినిపించాయి.

## శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ వద్ద
# భారీ ప్రమాదం

మొదటి పేజీ తరువాయి...


పడిపోయింది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం పనులను తిరిగి ప్రారంభించింది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం ఆ పనుల్లో ప్రమాదం చోటుచేసుకుంది. టన్నెల్ పైభాగంలో మూడు మీటర్ల మేర పడిపోయింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో పనులు జరుగుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఘటనాస్థలికి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఈ ఘటనలో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. వీరిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. శ్రీశైలం ప్రాజెక్టు వెనుక జలాల నుంచి టన్నెల్ ద్వారా వెనుకబడిన నల్గొండ జిల్లాకు సాగు, తాగు నీరందించేందుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలో సొరంగ మార్గం నిర్మిస్తున్నారు. ఆ పనుల్లో మొదటి షిఫ్ట్‌లో సుమారు 50 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా.. ఆకస్మాతుగా పైకప్పు కూలి మట్టిపెల్లలు విరిగి పడ్డాయి. దీంతో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. వారిలో 42 మంది బయటకి రాగా.. 8 మంది కార్మికులు లోపల చిక్కుకున్నట్లు సమాచారం. ఘటనాస్థలి వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. టన్నెల్‌లో పైకప్పు కూలి కార్మికులు గాయపడిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, అగ్నిమాపక శాఖ, హైడ్రా, నీటిపారుదల శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. విషయం తెలుసుకున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఘటనాస్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. ఉత్తమ్ వెంట నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, అధికారులు ఉన్నారు. ఈ ప్రమాదంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం ఎలా జరిగిందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. లోపల చిక్కుకున్న వారిని క్షేమంగా తీసుకురావాలని.. గాయపడిన వారికి మెరుగైన చికిత్స




అందించాలని అధికారులను ఆదేశించారు. గమనించదగిన విషయం ఏమిటంటే, ఈ టన్నెల్‌లో నాలుగు రోజుల క్రితమే ఎడమవైపు పనులు ప్రారంభమయ్యాయి. అయితే, ఎంతో త్వరగా ఈ ప్రమాదం జరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. టన్నల్ బోర్ మెషిన్‌తో డ్రిల్లింగ్ జరుగుతుండగా, కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదం జరిగిన క్షణాల్లో టన్నెల్ లోపల పనిచేస్తున్న కార్మికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భారీ శబ్దం రావడంతో సమీపంలోని కార్మికులు అప్రమత్తమై లోపలికి పరుగెత్తారు. అప్పటికే పైకప్పు కూలిపోవడంతో ఏడుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. ప్రభుత్వం టన్నెల్ నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేయాలనే లక్ష్యంతో ఇంజినీర్లపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఏడాదిలోపు పనులు ముగియాలన్న లక్ష్యంతో ఇరిగేషన్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. అయితే, ఇలాంటి తక్షణ ప్రాజెక్టలలో పనుల నాణ్యతను విస్మరించడం ప్రమాదాలకు దారితీసే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే ఇరిగేషన్ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్న దానిపై వారు సమగ్ర విచారణ చేపట్టారు. పనుల్లో ఎక్కడ తప్పుదొర్లిందో అంచనా వేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ ప్రమాదం తర్వాత టన్నెల్ వద్ద పనిచేస్తున్న కార్మికుల్లో భయం నెలకొంది. బాధిత కార్మికుల కుటుంబ సభ్యులు కూడా భద్రతా చర్యల పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ అధికారుల నుండి మరిన్ని వివరాలు రావాల్సి ఉంది. ఈ ప్రమాదానికి నిజమైన కారణం ఏంటనే దానిపై త్వరలో స్పష్టత రానుంది.

## మున్నూరు కాపు సంఘం జోగులాంబ గద్వాల
# జిల్లా కన్వీనర్‌గా కొత్త గణేష్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి22 (ప్రభాత ఉదయం)మున్నూరు కాపు సంఘం జోగులాంబ గద్వాల జిల్లా కన్వీనర్ గా కొత్త గణేష్ నియమించారు. శనివారం హైదరాబాద్ లోని మియా పూర్ లో మున్నూరు కాపు ప్రజా ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర యూత్ ఫోర్స్ అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ చేతుల మీదుగా గద్వాల జిల్లా కన్వీనర్ గా కొత్త గణేష్ నియమాక పత్రం అందజేశారు.. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో రాష్ట్ర నాయకుడు సిహెచ్ విఠల్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర సంఘం అధ్యక్షులు కొండా దేవయ్య, పటేల్ యువ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్, శేషంపల్లి నరసింహులు, జైపాల్ రెడ్డి, వెంకట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# సొరంగ ప్రమాదానికి బాధ్యత రేవంత్‌దే

హైదరాబాద్,ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం): ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద జరిగిన ప్రమాదానికి పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కుప్పకూలిన ఘటన మరువకముందే రాష్ట్రంలో మరో దుర్ఘటన జరగడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గుత్తేదార్లతో కుమ్మక్కై, కమిషన్ల వేటలో పర్యవేక్షణ గాలికి వదిలేయడం, నాణ్యతా ప్రమాణాల విషయంలో పూర్తిగా రాజీపడటం వల్లే ఇలాంటి ఘటనలు జరుగు తున్నాయని ఆరోపించారు. చిక్కుకుపోయిన కార్మికులను క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకు పనులు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఒక బ్యారేజీలో కేవలం పిల్లర్ కుంగితే నానా హంగామా చేసిన కాంగ్రెస్ నేతలు.. వారి హయాంలో జరుగుతున్న వరుస వైఫల్యాలపై ఏమంటారని ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదంలో గుత్తేదారును కాపాడేందుకు వాస్తవాలు దాచి పెట్టిన ప్రభుత్వం.. కనీసం ఎస్ఎల్‌బీసీ ఘటనలో పారదర్శకంగా దర్యాప్తు జరిపి ప్రమాదానికి గల కారణాలను బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం కాంగ్రెస్ సర్కార్ అసమర్థతకు, చేతగాని తనానికి నిదర్శనం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. చేయక చేయక ఒక ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి ఆరంభంలోనే అంతం చేసిన ఘనత కాంగ్రెస్ పాలకులదే అని విమర్శించారు. మొన్న సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కూలిన ఘటన, నేడు ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్ప కూలడం కాంగ్రెస్ కమిషన్ సర్కారు వైఫల్యానికి నిదర్శనం అని హరీశ్‌రావు విమర్శించారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. గత నాలుగు రోజులుగా కొద్దికొద్దిగా మట్టి కూలుతున్నదనీ గుర్తించినప్పటికి ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం రేవంత్ సర్కార్ నిర్లక్ష్యమేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడగా, మరికొంత మంది కార్మికులు లోపల ఉన్నట్లు తెలుస్తుంది. వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడాలి. డీ వాటరింగ్ చేసి, వెంటనే విద్యుత్ పునరుద్ధరించి, శిథిలాలను తొలగించి కార్మికులను వెంటనే బయటకు తీసుకురావాలి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వెంటనే ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# కుంభమేళాలో నడ్డా పవిత్ర స్నానం

మొదటి పేజీ తరువాయి...

జరిగే ఈ కుంభమేళాకు సామాన్య భక్తులతోపాటు ప్రముఖులు కూడా తరలి వస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు ఇప్పటికే త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన విషయం తెలిసిందే. తాజాగా కేంద్ర మంత్రి జేపీ నడ్డా మహాకుంభమేళాను సందర్శించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు చేశారు.



## సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ ఫోన్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ ఫోన్ చేశారు. నాగర్ కర్నూలు జిల్లా వద్ద ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పన్నుల్లో జరిగిన ప్రమాదం విషయంలో సహాయ చర్యల గురించి ఆయన ఆరా తీశారు. ఉదయం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పన్నులు జరుగుతున్న సమయంలో ఒక్క సారిగా పై కప్పు కుప్పకూలిపోయింది. దీంతో ఎనిమిది మంది కూలీలు లోపల ఇరుక్కుపోయారు. మొత్తం యాభై మంది వరకూ టన్నెల్ లోకి వెళ్లారు. అయితే నలభై రెండు మంది బయటకు వచ్చారు. మరో ఎనిమిది మంది లోపలే ఉండిపోయారు.ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహా పలు బృందాలు వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాయి. మొత్తంగా మూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు నాగర్ కర్నూలుజిల్లాకు చేరుకున్నాయి. రేవంత్‌కు ఫోన్ చేయక ముందే ప్రధాని మోదీ ఈ అంశంపై వివరాలు తెలుసుకున్నారు. సహాయ చర్యలపై కీలక ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ పరంగా తాము తీసుకుంటున్న చర్యలను రేవంత్ రెడ్డి ప్రధానికి వివరించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు కొంత కాలం క్రితం నిలిపోయాయి. వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో నాలుగు రోజుల కిందటే పనులు ప్రారంభించారు. ఈ లోపే ఈ ప్రమాదం జరిగింది. ఆ కార్మికుల్ని సేఫ్‌గా బయటకు తీసుకు వచ్చేందుకు అన్నిప్రయత్నాలు చేస్తున్నారు.

## పాక్ జైలు నుంచి 22 మంది
# మత్స్యకారుల విడుదల

మొదటి పేజీ తరువాయి...

లేకుండా పొరపాటున అంతర్జాతీయ జలాల సరిహద్దులు దాటుతున్న వారిపై దయతో వ్యవహరించాలని అభ్యర్థించారు. వాఘా సరిహద్దు ద్వారా పాక్ అధికారులు ఈ జాలర్లను భారత్‌కు అప్పగిస్తారు. అన్ని పక్రియలు పూర్తిచేసిన తర్వాత మన అధికారులు వారిని స్వస్థలాలకు పంపేందుకు ఏర్పాట్లుచేస్తారు. మత్స్యకారులు సరిహద్దులను సరిగా గుర్తించక పోవడంతో ఇరువైపులా ఈ అరెస్టులు జరుగుతున్నాయి. ఇదిలాఉంటే.. జనవరి 1న ఇరుదేశాల ఖైదీల జాబితా మార్పిడి జరిగింది. పాకిస్థాన్‌లో 266 మంది భారత ఖైదీలు ఉన్నారు. భారత జైళ్లలో మొత్తం 462 మంది పాకిస్థానీయులు ఉన్నట్లు మన దేశ జాబితా పేర్కొంది. ఈ సందర్భంగా ఇరు దేశాలు ఈ విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

# నేడు ఉప్పర్‌పల్లిలో శ్రీ అయ్యప్ప స్వామీ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు




పూజలలో పాల్గొన్న భక్తులు



ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహం

బుద్వేల్, ఫిబ్రవరి22(ప్రభాత ఉదయం) ఉప్పర్ పల్లి శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప, శ్రీ వీరాం జనేయ భక్త సమాజం, బస్తీ ప్రజల ఆద్వర్యంలో అయ్యప్ప స్వామీ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపన పూజా మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ నెల 21న పూజా కార్యక్రమాలు ప్రారంభమైనాయి. శనివారం ఉదయం వేధ పారాయణము, గణపతి పూజ, పుణ్యహావాచనము, మండవ పూజలు, మూల మంత్ర జపము, రుద్ర హెూమము, క్షీరాధివాసము 5. ఆదివాసాంగ హెూమాలు నిర్వహించారు. సాయంత్రం మండప దేవతా హెూమాలు, ప్రధాన దేవత హెూమాలు, కుండ సంస్కారము, మహా స్నపనము, పుష్ప, ధాన్య, శయ్యాధి వాసములు, నిద్ర దేవతా పూజ, దర్బారు సేవ, నీరాజనము. మంత్ర పుష్ప, తీర్థ ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. 23వ తేదీన ఆదివారం ఉదయం 4గంటలకు గణపతి పూజలతో పూజా కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఉదయం 5:04 నిమిషాలకు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అయ్యప్ప స్వామీ దేవాలయంతో పాటు శ్రీ గణపతి, సు బ్రమణ్య స్వామీ, శివ పంచాయతన, ద్వాదశ జ్యోతిర్లింగ, సంతోషి మాత, ధ్వజ సంభ ప్రతిష్ఠ మాజలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాష్ ను కలసి శుభాకాంక్షలు తెలిపిన నాన్ టీచింగ్ ఎమ్ప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ షర్ఫుద్దీన్, తదితరులు

## వెటర్నరీ వర్శిటీ వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం.జ్ఞాన ప్రకాశ్

బుద్వేల్, ఫిబ్రవరి22(ప్రభాత ఉదయం)–పీవీ నర్సింహ్మారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం.జాన ప్రకాశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అయనను వర్శిటీ నాన్ టీచింగ్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ షర్ఫుద్దీన్ తో పాటు ఉద్యోగ సంఘాల నాయకులు వీసీ చాంబర్ లో కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.జ్ఞాన ప్రకాశ్ మాట్లాడుతూ, పశు వైద్య విశ్వవిద్యాలయం అభివృద్ధికి, పశు సంపదపై ఆధారపడి జీవిస్తున్న రైతుల సంక్షేమానికి అందరం కలసి పనిచేద్దామని సూచించారు. వైస్ చాన్సలర్ ను కలసిన వారిలో ఉద్యోగ సంఘాల నాయకులు సుదర్శన్, అంజి, పెంటయ్య తదితరులు ఉన్నారు.

## పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో ఇంటర్ కాలేజియేట్ క్రీడలు, సాహితీ, సాంస్కృతిక పోటీలు ప్రారంభం




క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

బుద్వేల్, ఫిబ్రవరి 22(ప్రభాత ఉదయం): పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వ విద్యాలయ స్థాయి మూడవ ఇంటర్ కాలేజియేట్ క్రీడా సాహితి, సంస్కృతిక పోటీలను శనివారం రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, క్రీడా పోటీలు వ్యాయామంతో సమానమన్నారు. పోటీతత్వం ఉన్నప్పుడే మన%శీ% నిర్దేశించుకున్న లక్ష్యాలని, ఉత్తమ ఫలితాలని అందుకోగలుగుతామని, అనుకున్న లక్ష్యం అందుకోలేకపోయినా నీరుగారకుండా మరింత ధృఢ సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరికి గెలుపు ఉండదని అసలు క్రీడల్లో పాల్గొనడమే మొదటి విజయం అని తెలియజేశారు. విశ్వవిద్యాలయ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ రిజిస్టర్ డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ, క్రిడలతో వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని, క్రమశిక్షణ, టీం వర్క్ , మానసిక ఆరోగ్యం పెంపొందించడంలో క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. డీన్ ఫ్యాకల్టీస్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులకు, సిబ్బందికి చదువుతోపాటు శారీరక ధృఢత్వం కూడా ఎంతో ముఖ్యమని అందుకోసం తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని విజయం కోసం కాకుండా క్రీడా స్ఫూర్తిని ఆస్వాదించాలని కోరారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఫిట్నెస్ కు క్రీడలు ఎంతో దోహదపడతాయని క్రీడల వలన డోపమైన్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తి అయి శారీరక, మానసిక ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని కలగజేస్తుందని తెలిపారు. ఈ క్రీడల్లో పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్, మామునూరు, కోరుట్ల, కామారెడ్డి మరియు పెబ్బేరు కళాశాలల నుండి 250 విద్యార్థినీ విద్యార్థులు 100 బోధన సిబ్బంది , 75 బోధినేతర సిబ్బంది పాల్గొననున్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాట్మెంటన్, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్ ఈవెంట్స్ తోపాటు సాహితీ, సాంస్కృతిక పోటీలు 25 వ తేదీ వరకు జరగనున్నాయని పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధురి తెలియజేశారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడా కారులు



ఆస్తి పన్ను పరిష్కార కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటి కమిషనర్ కె రవికుమార్

## ప్రతి శనివారం ఆస్తి పన్ను పరిష్కార వేదిక

బుద్వేల్, ఫిబ్రవరి22(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఆస్తి పన్ను పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ తెలిపారు. శనివారం జరిగిన ఆస్తి పన్ను పరిష్కార వేధికలో ఐదు దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిలో మూడు దరఖాస్తులు తమకు ఆస్తి పన్ను ఎక్కువగా ఉందని, దానిని తగ్గించాలని వచ్చిందని తెలిపారు. విచారణ చేసి వారి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. మరో రెండు సమస్యలకు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



జనవాసాల మధ్య బెల్టు షాప్ నిర్వహిస్తున్న దృశ్యం

## బుద్వేల్‌లో ఆలయం సమీపంలో బెల్ట్ షాప్

**ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

**బెల్ట్ షాప్ తొలగించే విధంగా ఎక్సైజ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి**

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ లో శివాలయం సమీపంలో బెల్ట్ షాపు నిర్వహిస్తుండడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పోలీస్ స్టేషన్ , జిహెచ్ఎంసి ఆఫీస్ , ఆర్టీసీ బస్ డిపో , శివాలయం టెంపుల్ కి దగ్గరలో బెల్ట్ షాప్ కొనసాగుతోందని ప్రజలు వాపోతున్నారు. మద్యం బాబులు గుడికి వచ్చే భక్తులు, రహదారి పొడవున వెళ్లే ప్రజల పట్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్ట్ షాపుల నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకొని తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## నేడు కాటేదాన్, గగన్ పహాడ్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22(ప్రభాత ఉదయం) గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. ఈ సెక్షన్ పరిధిలోని ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుండి 11 గంటల వరకు సర్వీసింగ్ గల్లి ప్రాంతం, రవి ఫుడ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు రవి ఫుడ్ పారిశ్రామిక ప్రాంతం, రామ్ చరణ్ ఆయిల్ మిల్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

**కాటేదాన్ లో...**

కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుండి 11 గంటల వరకు పుస్తి ఫుడ్స్, చింటూ ఫుడ్, సాగర్ గుట్కా, చావుల ఫుడ్, భగవతి దాల్మిల్, ఏఎంసీ ప్లాస్టిక్, కాటేదాన్ పారిశ్రామిక వాడ, సిటిజన్ కాంట్రా విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన సిటిజెన్ కాంట, వికాస్ ఫుడ్, డుకిస్, వి ఎం ఎల్ ఫర్నిచర్, వివిఎల్ ఫర్నిచర్, చాటాయే కంపెనీ, కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతం, గంగోత్రి విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన గణేష్ నగర్, పారిశ్రామిక వాడ లేన్, అమ్మ గార్డెన్, పయనీర్ స్కూల్, బాబా టెంట్ హౌస్, షమా టెంట్ హౌస్, దుర్గామాత విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన దుర్గా మాత టెంపుల్, కలకత్తా ప్లాస్టిక్ కంపెనీ ప్రాంతం, సాయిబాబా నగర్ ప్రాంతం, కాటేదాన్ ఫీడర్–2 పరిధిలో గల ప్రాంతాలైన విశ్వకర్మ ఇంజనీరింగ్, బెటర్ కంపెనీ, నేతాజీ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన సాయిబాబా నగర్ విలేజ్, బాబా కంటైనర్, పవర్ మాక్స్, నేతాజీ నగర్ బస్తి, శ్రీరామ్నగర్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన శ్రీరామ్నగర్ బస్తి, పురాణ మజీద్ ప్రాంతం, హెచ్ఎంటి కంపెనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. గగన్ పహాడ్, కాటేదాన్ ప్రాంతంలోని విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## రంజాన్ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలి




రంజాన్ మాసంలో చేయవలసిన ఏర్పాట్లపై అత్తాపూర్ బడా మజీదులో సమావేశమైన ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ ఆంజదుల్ల హుస్సేని

బుద్వేల్', ఫిబ్రవరి22 (ప్రభాత ఉదయం) :రంజాన్ పండుగకు మసీదులలో, ముస్లిం మైనారిటీ ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలలో కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని శాసనమండలి సభ్యుడు మీర్జా రహ్మత్ బేగ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఆంజదుల్లా హుస్సేనీలు అన్నారు. శనివారం అత్తాపూర్ బడా మజీదు లో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం మత పెద్దలతో వారు సమావేశమైనారు. రంజాన్ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండ చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నవాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ శ్మశాన వాటికలో బోరు వేయిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు కిరోసిన్ రాజు

## రాజేంద్రనగర్ స్మశానవాటికలో స్వంత ఖర్చులతో బోరు వేయించిన కిరోసిన్ రాజు

**శభాష్ రాజు అంటున్న రాజేంద్రనగర్ ప్రజలు**

బుద్వేల్, ఫిబ్రవరి22(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ స్మశానవాటికలో పాడైన బోరును బాగు చేయించాడు బీఆర్ఎస్ నాయకుడు కిరోసిన్ రాజు. తన తండ్రి డి.యాదయ్య జ్ఞాపకార్థం ఆయన పాడైన బోరు స్థానంలో శుక్రవారం కొత్త బోరు వేయించారు. త్వరలోనే ఆ బోరుకు మోటారు బిగిస్తానని ప్రకటించారు. దీంతో రాజేంద్రనగర్, మాణిక్యమ్మకాలనీ, అంబేద్కరనగర్, హనుమాన్ నగర్, ఎన్ఐఆర్డీపీఆర్ క్యాంపస్, శాంతినగర్ తదితర బస్తీల ప్రజలు హర్షం వ్యక్తం చేసారు. స్మశానవాటికలో బోరు పాడై మూడు సంవత్సరాలు అవుతున్నదని, ఈ విషయమై ఎమ్మెల్యే, కార్పొరేటర్ కు చెప్పుకున్నా. అధికారుల వద్ద మొరపెట్టుకున్న ఎవరు పట్టించుకోలేదని గుర్తు చేసారు. చివరకు స్థానిక బీఆర్ఎస్ నాయకుడు కిరోసిన్ రాజు ముందుకు వచ్చి స్వంత ఖర్చులతో బోరు వేయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మోటారు కూడా త్వరగా బిగించి అందరు వాడుకునేటట్లు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జి.రాకేశ్, రాజు, వి. నవీన్ కుమార్, మహేశ్ తదితరులు ఉన్నారు.

## రాజేంద్రనగర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా దుంబాల ఝాన్సీరెడ్డి

బుద్వేల్, ఫిబ్రవరి22 (ప్రభాత ఉదయం): మహిళా కాంగ్రెస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షురాలుగా రాజేంద్రనగర్ బస్తీకి చెందిన దుంబాల ఝాన్సీరెడ్డి నియమితులైనారు. ఈ మేరకు శనివారం ఆమెకు రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పామెన జ్యోతి భీం భారత్ రాజేంద్రనగర్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అద్యక్షురాలు జుబేర్ రహమాన్ లు నియామక పత్రాలను అందజేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షురాలుగా అత్తాపూర్ కు చెందిన రమాదేవి నియమితులైనారు. ఆమెకు పామెన జ్యోతి, జుబేరా రహమాన్ లు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజేంద్రనగర్ లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.




దుంబాల ఝాన్సీ రెడ్డికి నియామక ఉత్తర్వులు జారీ చేసిన మహిళా కాంగ్రెస్ రంగా రెడ్డి జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతి భీం భారత్



రాజేంద్రనగర్ నియోజకవర్గం బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియామక పత్రం తీసుకుంటున్న రమాదేవి



భర్త ఇంటిముందు నిరసన తెలుపుతున్న కవిత అలియాస్ లహరి

## భర్త ఇంటి ముందు భార్య ఆందోళన

**మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మీగూడలో భార్య కవిత అలియాస్ లహరి న్యాయపోరాటం**

బుద్వేల్,ఫిబ్రవరి 22(ప్రభాత ఉదయం): ఓ మహిళ తన భర్త ఇంటి ఎదుట న్యాయ పోరాటానికి దిగింది. మైలార్ దేవుపల్లి లక్ష్మీగూడలో భర్త ఇంటి ముందు బైటాయించింది. కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేపట్టింది.ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీగూడలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. హైదరాబాద్ జియగూడకు చెందిన కె.శివ కుమార్ గత నాలుగు సంవత్సరాల క్రితం కుటుంబ సమేతంగా లక్ష్మీగూడ బస్తీలో సొంత ఇల్లు నిర్మించుకొని ఉంటున్నారు.శివకుమార్ కు నాలుగేండ్ల క్రితం మేడిపల్లి ప్రాంతానికి చెందిన కవిత అలియాస్ లహరితో వివాహం జరిగింది. దంపతులు ఇద్దరు కొంతకాలం అన్యోన్యంగా ఉన్నప్పటికీ..ఆ తర్వాత గొడవలు ప్రారంభమయ్యాయి.భర్తకు అత్త పద్మ తోడు కావడంతో వేదింపులు అధికమయ్యాయి. తరచూ ఆమెను కొట్టేవాడు.దీనిని తట్టుకోలేని కవిత అలియాస్ లహరి ఆరు నెలల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.అయితే అప్పటినుంచి వేధింపులు మరింత ఎక్కువయ్యాయి.ఆమెను ఇంట్లోకి రానివ్వకుండా గెంటేశారు.ఇదిలా ఉంటే.. భర్తపై లహరి మరసారి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు శనివారం ఉదయం ఫిర్యాదు చేసింది.కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీగూడలోని శివ కుమార్ ఇంటి ముందు భైఠాయించారు.తనకు న్యాయం జరిగేంత వరకు ధర్నా కొనసాగిస్తానని లహరి స్పష్టం చేశారు.



## విద్యార్థులకు ప్యాడ్లు,పెన్నులు పంపిణీ

కొత్తకోట, ఫిబ్రవరి 22(ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణం లోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం నందు జే.ఎస్.రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఐదవ తరగతిలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కొరకు విద్యార్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమం గత రెండు నెలల నుండి ఉపాధ్యాయులు సి.ఏ.అనిల్, N. భాను,మరియు జే.అనిల్ ల సహకారంతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని. శనివారం కోచింగ్ సెంటర్ ను సందర్శించిన జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు జె.యం. మిషేక్ విద్యార్థులకు ప్యాడ్లు ,పెన్నులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అమృతరాజు మాట్లాడుతూ.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని గురుకుల ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రతి ఒక్కరు కూడా సీటు సాధించి ,విజయం పొందాలని ,చదువుకు అధిక ప్రాధాన్యత నివ్వాలని, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు చేరి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు . ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సతీష్ రాజు, కర్ణ కుమార్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యకు 15% బడ్జెట్ కేటాయించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి22(ప్రభాత ఉదయం)విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ సభ్యులందరి చేత సేకరించిన సంతకాలను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపడం జరిగిందని అధ్యక్షులు వీరన్న తెలిపారు. శనివారం కేటీదొడ్డి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి బాలల హక్కుల పరిరక్షణ వేదిక శిక్షణబాలల హక్కులను కాపాడి, వారి హక్కులకు మద్దతు ఇవ్వాలని కోరుతూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలలో పిల్లల హాజరు శాతం పెంచాల్సిన బాధ్యత బాలల హక్కుల పరిరక్షణ సభ్యులపై ఉందని అన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులందరూ కూడా తీర్మానం చేసి సంతకాలు సేకరించి, ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ బడేసాబ్, ఎంవిఎఫ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సాయికుమార్, మండల ఇంచార్జ్ కిరణ్ కుమార్, సీఆర్పీ కోర్డినేటర్లు, గ్రామ కన్వీనర్ లు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా సదస్సును జయప్రదం చేయండి

### సిఐటియు జిల్లా కార్యదర్శి వివి నరసింహ

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం) కేంద్ర బడ్జెట్ లో కార్మికులకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు రేపు జిల్లా కేంద్రంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వివి నరసింహ పిలుపునిచ్చారు శనివారం జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేపు అనగా ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని స్థానిక వాల్మీకి కమ్యూనిటీ హాల్లో జిల్లా సదస్సు ఉంటుందని తెలిపారు సదస్సులో కార్మిక వర్గానికి కేంద్ర బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని వివరించనున్నట్లు తెలిపారు ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు హాజరుకానున్నారని తెలిపారు. సదస్సుకు జిల్లాలోని కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ వివో ఏల సంఘం జిల్లా అధ్యక్షులు డ్యాం అంజి గద్వాల మండల అధ్యక్షుడు తిమ్మప్ప ధరూర్ మండల సీఐటీయూ కన్వీనర్ శ్రీనివాస్ నాయకులు వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.



## మీసేవ కేంద్రాలను తనిఖీ చేసిన ఈడీఎం

గద్వాల జిల్లా ప్రతినిధి , ఫిబ్రవరి22(ప్రభాత ఉదయం)గద్వాల పట్టణంలోని మీసేవ కేంద్రాలను శనివారం ఈడియం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీసేవ కేంద్రాలలోని సిటిజన్ చార్ట్ నోటీస్ బోర్డ్ , సర్టిఫికెట్ రిజిస్టర్స్, టోల్ ఫ్రీ కాల్ నంబర్స్ ను ప్రజలకు అందిస్తున్న సేవలు గురించి ఆరా తీశారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు సిటిజన్ చార్ట్, సర్టిఫికెట్ రిజిస్టర్స్ గురించి వినియోగదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఈడిఎం శివ మాట్లాడుతూ...ప్రజలకు అసౌకర్యాన్ని కలిగించకుండా మీ సేవలపై వచ్చిన ఆరోపణల దృష్ట్యా నిర్దేశించిన రుసువు మాత్రమే తీసుకోవాలని, అదనంగా తీసుకున్న యెడల మీసేవా కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా రేషన్ కార్డు సర్వీసులకు రూ.45 మాత్రమే చెల్లించాలని వినియోగదారులకు సూచించారు. అలాగే ప్రజలకు మెరుగైన సేవలందించడమే మీసేవ కేంద్రాల కర్తవ్యం అని ఆయన తెలిపారు. ధరల పట్టిక కూడా క్షుణ్ణంగా కేంద్రాలలో ఉండాలని సూచించారు.

# నూనె గింజలు ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదుగుదాం



పామ్ ఆయిల్ కంపెనీ నిర్మాణ పనుల భూమి పూజ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల



కంపెనీకి భూమి పూజ చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పామ్ ఆయిల్ కంపెనీ నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల, డాక్టర్ జి చిన్నారెడ్డి, ఎమ్మెల్యే జిఎంఆర్

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
### జిల్లా రైతులకు కంపెనీ ఏర్పాటుతో ఎంతో దోహదం: ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి
### కంపెనీ ఏర్పాటు వల్ల పర్యావరణ హానికర వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలి ఎమ్మెల్యే: జిఎంఆర్

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22(ప్రభాత ఉదయం) దేశంలో ఉన్న మంచి నూనె కొరతను అధిగమించి ఇతర దేశాలకు ఎగుమతి చేసేస్థాయికి ఎదిగేందుకు అత్యధికంగా పామాయిల్ సాగుని పెంచాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి వనపర్తి జిల్లాలో పర్యటించి దేవరకద్ర నియోజకవర్గంలోని సంకిరెడ్డి పల్లి గ్రామంలో ప్రీయునిక్ సంస్థ ద్వారా నిర్మించనున్న పాయిల్ ఫ్యాక్టరీకి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పామాయిల్ రైతులతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ... భారత దేశంలో ప్రజలకు అవసరమైన మేరకు వంట నూనె ఉత్పత్తి లేకపోవడం వల్ల ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని తద్వారా మన ఫారెన్ నిల్వలు ఇతర దేశాలకు చెల్లించడం జరుగుతుందన్నారు. దేశంలో వంతనునెల లోటు భర్తీ చేయాలంటే 70 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ పెట్టుబడి తో అత్యధిక లాభం పొందే పంట పామాయిల్ పంట మాత్రమే అని అన్నారు. పామాయిల్ సాగుకు ప్రభుత్వం ద్వారా ఎకరాకు 51 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. మొక్కల పంపిణితో మొదలుకొని డ్రిప్, 4 సంవత్సరాల వరకు అంతర్ పంట సబ్సిడీ కింది ఎకరాకు 4200 రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ కంపెనీ వారు రైతులతో ఒప్పందం చేసుకుని పంట చేతికి వచ్చాక నేరుగా కంపెనీ వారే కొనుగోలు చేసుకుంటారని చెప్పారు. ప్రస్తుతం పామాయిల్ గెలలు మార్కెట్లో టన్నుకు 20,487 రూపాయల ధర పలుకు తుందనీ త్వరలోనే 25 వేలకు చేరుకుంటుందని తెలియజేశారు. ఇప్పుడు భూమి పూజ చేస్తున్న పామాయిల్ కంపెనీ. ఆగష్టు 15 నాటికి ప్రారంభోత్సవం చేస్తామని అదేవిధంగా బీచ్ పల్లి వద్ద ఉన్న వేరు సెనగ ఆయిల్ కంపెనీని మరమ్మతులు చేసి పామాయిల్ కంపెనీగా ఇదే సంవత్సరంలో ప్రారంభించుకుంటామని భరోసా ఇచ్చారు. రైతులు రాష్ట్రంలో అత్యధికంగా పామాయిల్ సాగు చేపట్టాలని రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పామాయిల్ తోట సాగు చేయించి ప్రతి జిల్లాకు ఒక పామాయిల్ కంపెనీ స్థాపించడం ప్రభుత్వ లక్ష్యంగా ప్రకటించారు. రైతులు పంట మార్పిడి వైపు అలోంచించాలని వనపర్తి జిల్లాలో 11 వేల ఎకరాల్లో సాగుకు లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. పామాయిల్ సాగులో భారత దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలబడాలని తెలిపారు. దేవరకద్ర శాసన సభ్యులు, వనపర్తి శాసన సభ్యులు అడిగిన అన్ని అభివృద్ధి పనులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సంకిరెడ్డి పల్లి గ్రామ ప్రజలకు పామాయిల్ కంపెనీ వల్ల ఎలాంటి నష్టం జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని, అవసరం అయి వారు కోరుకుంటే ఇక్కడి నుంచి తరలించడానికి సైతం వెనూకాడమని హామి ఇచ్చారు.ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నా రెడ్డి మాట్లాడుతూ... వనపర్తి జిల్లా ప్రజలు ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్న పామాయిల్ కంపెనీ ఎట్టకేలకు భూమి పూజ చేసుకోవడం జరిగిందని, త్వరలోనే నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రీయునిక్ సంస్థను కోరారు. జిల్లాలో ఇది వరకే సాగు చేసిన పంటకు గెలలు కోతకు వస్తున్నాయని, వాటిని కోసిన 24 గంటల్లో అయిల్ గా మార్చాల్సి ఉంటుందని లేనియెడల అది పనికిరాకుండా పోతుందన్నారు. భారత దేశం వంటనూనెలు, పప్పు దినుసుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. వేరుశెనగ హెక్టారులో తీసిన వేరుశెనగ నుండి వంట నూనె 0.4 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అయితే పామాయిల్ గెల నుంచి హెక్టారుకు 4 మెట్రిక్ టన్నుల వంట నూనె ఉత్పత్తి అవుతుందన్నారు. పామాయిల్ సాగు వల్ల సంవత్సరానికి ఎకరాకు 1.5 లక్షల ఆదాయం వస్తుందని తెలియజేశారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డ అని, బడుగు బలహీన వర్గాలు, రైతుల సమస్యలు తన సమస్యలు గా భావించి పరిష్కరిస్తున్నారని అన్నారు. ఇంటింటి సర్వే, కులగణన విజయవంతంగా పూర్తి చేసి ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు.

స్థానిక శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... సంకిరెడ్డి పల్లిలో పామాయిల్ కంపెనీ ఏర్పాటు వల్ల పర్యావరణ హానికర వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. సహకార సంఘాల అధ్యక్షులు పదవీకాలం మరో 6 నెలలు పొడిగించినందున ధన్యవాదాలు తెలిపారు. భూత్పూర్ అడ్డాకుల మధ్య మరో మార్కెట్ యార్డు మంజూరు చేయాలని, దేవరకద్ర నియోజకవర్గంలో మరో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం ను మంజూరు చేయాలని మంత్రిని కోరారు. మండలాల్లో వ్యవసాయ అధికారులకు కార్యాలయాల కొరత ఉందని వాటిని మంజూరు చేయాలని, రైతులకు వ్యవసాయ పనిముట్లు మంజూరు చేయాలని కోరారు. ఆయిల్ పామ్ కంపెనిలో పనిచేసేందుకు ఈప్రాంత ప్రజలకే ఉద్యోగ అవకాశం కల్పించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ... వనపర్తి జిల్లాలో 1680 మంది రైతులు 5500 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారని, త్వరలో 10 వేల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యానవన శాఖలో సిబ్బంది కొరత ఉందని వాటిని భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు వంతెనల నిర్మాణానికి అనుమతులు తీసుకున్నామని, జిల్లాలో వేరు సెనగ సాగు ఎక్కువగా ఉన్నందున పెద్ద మందడి మండలంలో వేరు శెనగ పరిశోధన కేంద్రం మంజూరు చేయాల్సిందిగా మంత్రిని కోరారు.

వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యానవన శాఖ మేనేజింగ్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, డి.సి.సి.బి చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సైతం మాట్లాడారు.

అంతకు ముందు పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఉప వైద్య కేంద్ర భవనం, మోజర్ల గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 8.38 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన వ్యవసాయ గోదాముల సముదాయానికి శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా పెబ్బరులో రూ. 5.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న మరో వ్యవసాయ గోదాము 5000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగినది, రూ. 44 లక్షల వ్యయంతో వ్యవసాయ కార్యాలయ అదనపు భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. రూ. 3.00 కోట్లతో పెబ్బేరులో ఇంతకుముందు కాలిపోయిన మార్కెట్ యార్డు గోదాము పునర్నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.

అనంతరం గోపాల్ పేట మండలం బుద్ధారం గండి ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామిని దర్శనం చేసుకున్నారు. అక్కడే గోపాల్ పేట మండలం పోల్కేపాడ్ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ యార్డు, ఘనపూర్ మార్కెట్ యార్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.

అదనపు కలక్టర్ రెవెన్యూ జి . వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం , వనపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, దేవరకద్ర మార్కెట్ యార్డు చైర్మన్ ప్రశాంత్, పి. ఏ.సి.ఎస్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





## మహా కుంభమేళాలో పవిత్ర స్నానం ఆచరించిన సామాజికవేత్త కుటుంబం

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి22(ప్రభాత ఉదయం)ఉత్తరప్రదేశ్‌లో ప్రయాగరాజ్ మహా కుంభమేళా సందర్భంగా శనివారం త్రివేణి సంగమంలో ప్రముఖ సామాజిక వేత్త చుక్క సుదర్శన్ రెడ్డి దంపతులు, రాయచూరు కాంగ్రెస్ నాయకులు ప్రతాప్ రెడ్డి దంపతులు, బంగి నవీన్ రెడ్డి దంపతులు పవిత్ర స్నానం ఆచరించారు. అంతకు ముందు వారు త్రివేణి సంగమం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహాకుంభమేళాలో పాల్గొనడం అందరికీ గొప్ప అవకాశం అని వారు అన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమం నిర్వహిస్తున్న యూపీ ప్రభుత్వాన్నికి ధన్యవాదాలు తెలిపారు.



తాండూరు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యేసు రత్నం

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22(ప్రభాత ఉదయం) మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శనివారం తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యేసు రత్నం, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి తాండూర్ మున్సిపల్ కమిషనర్ ను కలిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు అశోక్ తాండూరు మున్సిపల్ అధ్యక్షులు నరసింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు ఉపాధ్యక్షులు వెంకటప్ప తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

## త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా జిల్లా వ్యాప్తంగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి

### గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్



జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి22(ప్రభాత ఉదయం)రాబోయే వేసవి కాలంలో త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా జిల్లా వ్యాప్తంగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో మండలాల వారీగా త్రాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయితీలో,మున్సిపల్ పరిధిలో నీటి సరఫరాను మెరుగుపరిచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎక్కడైనా నీటి కొరత ఏర్పడినట్లయితే,తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నిరంతరం త్రాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.జిల్లాలో త్రాగునీటి సరఫరా ప్రభావితంగా కొనసాగేలా బల్క్ వాటర్ సప్లై, ఓహెచ్ఎస్ఆర్, సింగిల్ ఫేజ్ చేతిపంపులు, ప్రైవేట్ బోర్ వెల్స్, ట్యాంకర్లు వంటి అన్ని మార్గాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు.అదనంగా వ్యవసాయ బోర్ వెల్స్‌ను కూడా బ్యాకప్ ప్రణాళికగా సిద్ధం చేయాలాని పేర్కొన్నారు.పీడబ్ల్యూఎస్ మోటార్లు,పైప్‌లైన్లు పూర్తిగా పరిశీలించి,15 రోజుల్లోగా అన్ని మరమ్మత్తులను పూర్తి చేయాలని ఆదేశించారు.త్రాగునీటి మొత్తం డిమాండ్,సరఫరా సమతుల్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బల్క్ వాటర్ సప్లై పద్ధతిగా సాగేలా గ్రిడ్ ఇంజినీర్లు సమర్థంగా పనిచేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు,ఏఈలు పరస్పర సమన్వయంతో నీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాలని సూచించారు.ప్రత్యేక అధికారులు గ్రామాలకు పర్యటనలు నిర్వహించి, నీటి వసతులు, మౌలిక సదుపాయాలు,నీటి నాణ్యత,శుద్ధి (క్లోరినేషన్),రిజిస్టర్లు పరిశీలించాలన్నారు.క్షేత్ర స్థాయిలో స్వయంగా గ్రామాల్లో పర్యటించి నీటి సరఫరా పరిస్థితిని పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,మిషన్ భగీరథ ఎస్.ఈ వెంకటరమణ,ఈ.ఈ గ్రిడ్ పరమేశ్వరి, ఈ.ఈ ఇంట్రా శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు,ఎంపీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లు, మిషన్ భగీరథ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608